క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

చింతపల్లి: చింతపల్లి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 10న విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో గల గూడెం కొత్తవీధి మండలంలోని 33కేవి విద్యుత్ లైన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గూడెం కొత్తవీధి మండలంలోని గాలికొండ, అమ్మవారి దారకొండ, దారకొండ, దుప్పిలవాడ, గుమ్మిరేవులు పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నమ్మి సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటుతో యువత జీవితాలు నాశనమవుతుందని, అటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గంగవరం: మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.లక్ష్మణరావు తెలిపారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలో గల ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరకావాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు ఎజెండా అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


మాట్లాడుతున్న పాకలపాటి గురుదేవులు ఆశ్రమ ప్రతినిధి రామానంద స్వామిజీ

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ సొలభం కాలనీ గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సమరసత నిర్వహణలో వాల్మీకి జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. పాకలపాటి గురుదేవుల ఆశ్రమం ప్రతినిధి రామానంద స్వామిజీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గూర్చి ఆయన వివరించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు అప్పలరాజు, వెంకటరమణ, మల్లిబాబు, మత్స్యరాజు, గణపతి, వీర్రాజు, చిన్నబ్బాయి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన


మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించాలని ఎంఈవో ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయుల మొదట విడత శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. మెరుగైన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. ఎంఈవో-2 బోడం నాయుడు, సీఆర్పీలు వెంకట రమణ, మునిబాబు, రాము, సంజీవరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


దుర్గాప్రసాద్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీ సర్పంచ్ కనిగిరి దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం రంపచోడవరంలో ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌ను కలసి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన పీవో సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తన లేఖను ఫార్వార్డ్ చేసినట్లు తెలిపారు. కాగా రాజవొమ్మంగిలో 40వేల లీటర్ల సామర్థ్యం గల రెండు రక్షిత నీటి పథకాలు అవసరమని దుర్గాప్రసాద్ అభిప్రాయపడ్డారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దారుణ దారులు

- అధ్వానంగా కుజభంగి- రూడకోట రోడ్డు
- గోతులతో సతమతం
- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


కుజభంగి- రూడకోట రహదారి దుస్థితి

పెదబయలు: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలను కలుపుతూ నిర్మించిన తారురోడ్డు పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారింది. ముంచంగిపుట్టు మండలం కుజభంగి జంక్షన్ నుంచి రూడకోట వరకు నాలుగేళ్ల క్రితం నిర్మించిన తారురోడ్డు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బంగారుమెట్ట, పర్రెడ, పెద్దాపుట్టు, పెద్దాపుట్టు , రూడకోట గ్రామ సమీపంలో ఘాట్ రోడ్డులో రాళ్లు తేలి దారుణంగా మారింది. గోతుల్లో వర్షపు నీరు నిండి ఉండడంతో రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పాడేరు నుంచి కుమడ వరకు వయా ముంచంగిపుట్టు మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సు రూట్‌లో మార్పులు చేశారు.

ఇటీవల కురిసిన వర్షాలకు కర్రిముక్కిపుట్టులో కల్వర్టు కోతకు గురికావడంతో ఈ సర్వీసుకు కుజభంగి జంక్షన్ మీదుగా కుమడ వరకు మాత్రమే నడుపుతున్నారు. అయితే కుజభంగి నుంచి రూడకోట వరకు రోడ్డు గుంతలు ఏర్పడి ఉండడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే రూడగోమంగి సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఇటీవల వర్షాలకు కోతకు గురైయింది. అయితే గుంతలకు మట్టితో పూడ్చిన రోజే పెద్ద వర్షం పడడంతో మట్టి కోతకు గురై మరలా గుంతలు ఏర్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. తప్పని పరిస్థితిలో బస్సు నడుపుతున్నారు.ఇటీవల వర్షాలకు మరింతగా రోడ్డు పాడైందని, అత్యవసర పరిస్థితిల్లో 108, 104 ఇతర వాహనాలు రావడానికి ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుజభంగి నుంచి రూడకోట వరకు గుంతలు ఏర్పడిన రోడ్డును నిర్మించాలని బంగారుమెట్ట, పర్రెడ, రూడకోట, బొండాపల్లి, కుమడ,కొరవంగి బాబుశాల,బూషిపుట్టు ప్రాంతవాసులు కోరుతున్నారు.

నిత్యం అవస్థలు



కుభజంగి నుంచి రూడకోట వరకు నిర్మించిన రోడ్డు గుంతలు ఏర్పడింది. అవస్థలు పడుతున్నాం. ఎన్నిమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా స్పందించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేయ లేదు, సుమారు 10 గ్రామ పంచాయతీలకు ప్రధాన రోడ్డుకు అధ్వానంగా ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించాలి.

– కాతారి సురేష్‌కుమార్, సర్పంచ్ రూడకోట, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం

ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ కుభజంగి నుంచి రూడకోట వరకు తారు రోడ్డు పూర్తిగా పాడైదంఇ. తారురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రెండు సార్లు పంపాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు.నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున రోడ్డు ఎక్కువగా దెబ్బతింది. గుల్లేలు జంక్షన్ నుంచి జంగంపుట్టు వరకు తారురోడ్డు పాడైంది. దానికి కూడ ప్రతిపాదనలు పంపాం.

– అశోక్, ఏఈ, పెదబయలు మండలం

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


హుకుంపేటలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నర్సీపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, రేగం రమేష్,బొంజుబాబు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, పార్టీ ఉపాధ్యక్షుడు వెంకట్, ఎంపీటీసీ సభ్యులు సింహాచలం, భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మాజీ ఎంపీటీసీ మహాదేవ్‌ను పరామర్శిస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.మహాదేవ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి బుధవారం స్వగ్రామానికి వచ్చారు. విషయాన్ని తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శరత్‌నగర్ గ్రామంలో వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మహాదేవ్ చేసిన సేవలను గుర్తు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, నాయకులు కృష్ణారావు, సింహాచలం , మోహన్, నరేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


కబడ్డీలో తలపడుతున్న బాలికలు


అడ్డతీగల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న ఎస్‌ఐ వినోద్

అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాల్లో క్రీడా పోటీలను ఎస్ఐ వినోద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రాథమికంగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణ భవిష్యత్ అనేక విజయాలకు నాంది అవుతుందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ తదితర క్రీడలు నిర్వహించారు. 180 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వి.కృష్ణారావు, ఎంఈవో పి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించారు.

మన్యంలో కుండపోత


జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల/హుకుంపేట: జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, భీకర శబ్దాలతో స్థానికులు ఆందోళన చెందారు. గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు కొంత సమయం ఆటంకం కలిగింది.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ


మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతిరావు

ముంచంగిపుట్టు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సిబ్బందికి జిల్లా ప్రథమ కో-ఆర్డినేటర్ తిరుపతిరావు పలు సూచనలిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో యాప్‌ల ద్వారా పనులు జరగాలని, ఎటువంటి సమస్యలున్నా, వాటిని అధిగమించేలా చూసుకోవాలన్నారు. ఎంపీడీవో ధర్మారావు, సీడీపీవో విమలకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

మండల సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం


ఎన్నికైన కమిటీ సభ్యులు

పెదబయలు: పెదబయలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సచివాలయ ఉద్యోగులు నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా కిల్లో గణపతి, ప్రధాన కార్యదర్శిగా సమరెడ్డి వరుణ్‌బాబు, కన్వినర్‌గా ఎం.రాజారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.తరుణ్‌కుమార్, బి.మధుసూదన్, గోపాల్, కోశాధికారిగా అరుణ్‌ప్రకాశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పని చేస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభను విజయవంతం చేయండి


ఐద్వా సభ్యులకు బియ్యం అందిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: డివిజన్ కేంద్రమైన చింతూరులో గురువారం జరిగే ఐద్వా జిల్లా రెండవ మహాసభను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి పద్మావతి కోరారు. దీనిపై బుధవారం సంఘం ఆధ్వర్యంలో చింతూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేసి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, రాములమ్మ, చిన్నమ్మ పాల్గొన్నారు.

బియ్యం వితరణ..చింతూరులో జరిగే ఐద్వా మహాసభలకు స్థానిక జేకేసీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ వంద కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారంలో ఐద్వా ప్రముఖపాత్ర పోషిస్తోందని, ఉద్యమాల్లో చురుకుగా ముందుకు సాగడం మంచి పరిణామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కడుతులలో పోషకాహార వస్తువుల స్టాల్‌ను పరిశీలిస్తున్న సీడీపీవో విమలకుమారి


గొరగుమ్మిలో పాల్గొన్న సిబ్బంది, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో సీడీపీవో విమల కుమారి మాట్లాడుతూ పౌష్టికాహారంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు.ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు రాజేశ్వరి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : గొరగొమ్మి అంగన్‌వాడీ కేంద్రంలో మహాపోషణ్ కార్యక్రమాన్ని బుధవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, తల్లులకు పోషకాహారం, తల్లిపాలు ప్రాముఖ్యాన్ని వివరించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

అరకులోయటౌన్: సీఐటీయూ అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమా మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 6,7వ తేదీల్లో జరిగిన సీఐటీయూ జిల్లా మహా సభల్లో జరిగిన ఎన్నికల్లో కోశాధికారిగా పోతురాజు, సహాయ కార్యదర్శులుగా కె.భాగ్యలక్ష్మి, భగత్‌రామ్, దీనబందు, ఎల్.సుందర్‌రావు, రవి, కె.బాలన్న, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కిల్లో మోసియా, జి.సత్యనారాయణ, శంకర్‌రావు, దురియా నాగమ్మ, రేణుక వెంకటగిరి, రాజ్‌కుమార్‌లతో పాటు మరో 40 మంది జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. పలువురు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థులందరూ క్రమశిక్షణతో రోజూ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. బుధవారం కళాశాలలో నూతన విద్యార్థులతో ఇండక్షన్ కార్యక్రమం ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ గణేష్ నాగబాబులు మాట్లాడుతూ నూతన విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. కళాశాలలో ఉన్న లైబ్రరీని విద్యార్థులు నిరంతరం వినియోగించుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మీ, ఎం.అనితకుమారి, అధ్యాపకులు లచ్చన్న, సునీల్, కామేశ్వరరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


గ్రామ సభలో అధికారులను సమస్యలపై నిలదీస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ బర్రెంగుల, గేదలబంధ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో సీపీఎం నేతలు జీనబంధు, సీతారాం సమస్యలపై నిలదీశారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు మంజూరైనా నేటికి కూటమి ప్రభుత్వం వేయలేదని, ఆదివాసీ గిరిజన కుటుంబాలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీలు లేక వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు.దీనికి స్పందించిన సచివాలయ అధికారులు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జున్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పీవోకు వినతి


ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజను సన్మానిస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: నిత్యం డోలి మోతలతో ఇబ్బందులు పడుతున్న మంప పంచాయతీ గొడుగులమ్మబంధకు రహదారి నిర్మించాలని ఎంపీపీ బడుగు రమేష్ తదితరులు పాడేరు ఐటీడీఏ పీవో, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు పాడేరులోని ఐటీడీఏ కార్యాలయంలో కొయ్యూరు వైస్ ఎంపీపీ అంబటి నూకాలుతో కలిసి ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గొడుగులమ్మబంధ రహదారి సమస్యను పీవోకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పీవో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాకరపాడు నుంచి కొయ్యూరు వరకు ఉన్న రహదారిని విస్తరించాలని, రెండు వంతెనలను ఏర్పాటు చేయాలని కోరారు. రేవళ్లలో పాఠశాల లేక అక్కడ చిన్నారులు ఎదుర్కొంటున్న అవస్థలను వివరించారు. రేవళ్ల యుడైస్ పేరిట కోడ్‌ను ఇచ్చి పాఠశాల మంజూరు చేయాలని కోరారు. రాజేంద్ర పాలెంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులపై సర్పంచ్ పీటా సింహాచలం వినతి పత్రం అందజేశారు. ఐటీడీఏ పీవోను కలిసిన వారిలో రేవళ్ల సర్పంచ్ వెంకటలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామి తదితరులున్నారు.

ఆదికర్మ యోగి అభియాన్‌తో గ్రామాల అభివృద్ధి


అధికారులకు గ్రామ సమస్యలను వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు

పాడేరు రూరల్: మండలంలోని సలుగు పంచాయతీ డల్లపల్లి, బూరుగుచెట్టు, బురదపాడు, గ్రామాల్లో ఆదికర్మ యోగి అభియాన్ ర్యాలీలు బుధవారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు బొంజుబాబు, నాయకులు గంగారాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సచివాలయం ఉద్యోగులు అగ్రికల్చర్ అసిస్టెంట్ అనిల్, ఇంజినీర్ అసిస్టెంట్ థామస్, వెటర్నరీ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో ఆదికర్మ యోగి అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, నాయకులు తాతారావు తదితరులు పాల్గన్నారు.

ఎలక్ట్రీషియన్ల సంక్షేమానికి కృషి


ఎలక్ట్రీషియన్‌లకు యూనిఫారాలను అందజేస్తున్న దాత సత్తిబాబు

జి.మాడుగుల: స్థానిక మత్స్యమాడుగులమ్మ ఆలయ ఆవరణలో బుధవారం శ్రీ మత్స్యమాడుగులమ్మ ఎలక్ట్రీషియన్ మండల యూనియన్ సమావేశం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ ఒప్పందం చేసుకొన్న పనులను వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎలక్ట్రీషియన్ల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యసాయి ఎలక్ట్రికల్ దుకాణ యజమాని సత్తిబాబు వితరణగా ఎలక్ట్రీషియన్లకు యూనిఫాం, కిట్లును అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు నాయుడు, కోశాధికారులు సాయి, ప్రసాద్, సభ్యులు జగదీష్, శ్రీను, చందు, రాజు, జాన్ తదితరులు పాల్గొన్నారు

తపాల సేవలపై విద్యార్థులకు అవగాహన


తపాలా సేవలను విద్యార్థులకు వివరిస్తున్న సబ్ పోస్టు మాస్టర్ మోహన్ ప్రసాద్

గంగవరం : తపాలా బిళ్లలు మన దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, జాతీయ గౌరవాన్ని ప్రతిబింబిస్తాయని సబ్- పోస్టు మాస్టర్ వై.మోహన్ శివ ప్రసాద్ అన్నారు. స్థానిక ఉప తపాలా కార్యాలయంలో పోస్టు మాస్టర్ మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ తపాలా వారోత్సవంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ''ఫిలాటెలీ డే'' ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ పోస్టుమాస్టర్ మోహన శివ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లో స్టాంప్ కలెక్షన్ అభిరుచిని పెంపొందించడం ద్వారా జ్ఞానం పెంపొందుతుందని, చరిత్రపై అవగాహన పెరుగుతుందన్నారు. హెచ్ఎం వరలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, తపాలా కార్యాలయ సిబ్బంది బాబి, వినయ్ విద్యార్థులు, తపాలా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


నుర్మతిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల: డీఆర్ డిపోల ద్వారా సక్రమంగా సకాలంలో రేషన్ సరకులు పంపిణీ చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో నుర్మతి, భీరం డిఆర్ డిపోలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డీఆర్ డిపోల అధ్వర్యంలో గల రేషన్‌కార్డుదార్లుకు పీడీఎస్ బియ్యం, నిత్యావసర సరకులు సరఫరాపై ఆరా తీశారు.

డీఆర్ డిపోల్లో సేల్స్‌మేన్లు అందుబాటులో ఉండి రేషన్‌కార్డు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ అందించాలని ఆయన ఆదేశించారు. రేషన్‌దార్లు నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. రేషన్ సరకుల స్టాకు, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.